# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది.

- సౌదీ అరేబియాలో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లా యువతను స్వదేశానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

- దివ్యాంగుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వర రావు అన్నారు.

- "నేషనల్ మెట్రాలజీ ఒలింపియాడ్"ను జాతీయ స్థాయిలో నిర్వహించనున్నామని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది.

==========================

రాష్ట్ర మంత్రి వర్గం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు సమావేశమైంది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకొంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గిరిజనగృహ పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే.. గత 5 సంవత్సరాల్లో నిర్మించని గృహాలను రద్దు చేస్తూ..మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. సమీకృత పర్యాటక విధానం, క్రీడా విధానాల్లో మార్పులకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఆయుర్వేద, హోమియోపతి ప్రాక్టీషనర్, రిజిస్ట్రేషన్ చట్ట సవరణకు సైతం ఆమోదం లభించింది. పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ సంస్మరణ దినంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అలాగే ఐటీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ పాలసీ 4.0ను మంత్రివర్గం ఆమోదించింది. అదేవిధంగా ఏపీ టెక్స్‌టైల్స్ గార్మెంట్ పాలసీ, ఏపీ మారిటైమ్ పాలసీకి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇదిలా ఉండగా ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు పూర్తి అయిన సందర్భంగా పనితీరుపై శాఖల వారీగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి మంత్రులను ఆదేశించారు.

==========================

సౌదీ అరేబియాలో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లా యువకులను తిరిగి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. జిల్లాలోని పలాస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, కంచిలి, ఇచ్ఛాపురం ప్రాంతాలకు చెందిన 16 మంది యువకులు ఏజెంట్ ద్వారా సౌదీ అరేబియాకు ఉద్యోగాల కోసం వెళ్ళి అక్కడ చిక్కుకుపోయారు. వారి విషయం తెలుసుకున్న మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఈ అంశంపై చర్చించి వెంటనే చర్యలు చేపడతామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి.... ఉత్తరాంధ్ర జిల్లాల్లో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. ఉత్తరాంధ్రలో పరిశ్రమల అభివృద్ధి, యువతలో నైపుణ్య శిక్షణ పెంపొందించేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతుందని తెలియజేశారు.

============================

ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని గుంటూరు నగరంలో ఈరోజు ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఎన్.టి.ఆర్.స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల నుండి వచ్చిన విభిన్న ప్రతిభావంతుల మధ్య, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, రాష్ట్ర గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, గుంటూరు పశ్చిమ శాసన సభ్యులు గళ్లా మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ... దివ్యాంగులు కూడా సమాజంలో భాగమేనని, వారి కష్టాలు తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. దివ్యాంగుల పింఛను 3 వేల నుండి 6 వేల రూపాయలకు పెంచటం, నిస్సహాయ స్థితిలో ఉన్న దివ్యాంగులకు 15 వేల రూపాయలు అందించడం వంటి కార్యక్రమాల పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

(వాయిస్ 33 సెకన్లు)

============================

ఆంధ్రప్రదేశ్ స్టేట్ మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీ నుండి మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల్లోనూ క్రీడా పోటీలు జరగనున్నాయి. మొత్తం 23 క్రీడా విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయి. ఈ పోటీలకు సంబంధించిన గోడ పత్రికను రాష్ట్ర క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈరోజు సచివాలయం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... క్రీడా పోటీల్లో అన్ని వయసుల వారు పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులకు ఇటువంటి పోటీలు మంచి వేదిక అని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

============================

ప్రభుత్వ భూములకు రెవెన్యూ అధికారులు సంరక్షకులుగా నిలవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ దినేష్ కుమార్ అన్నారు. ఈరోజు జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పరమైన పౌర సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవిన్యూ అధికారుల పనితీరు మెరుగుపడాలని, పౌర సేవలు అందించడంలో జాప్యం జరగకూడదని అన్నారు. ప్రజలకు కావలసిన కుల ధ్రువీకరణ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు త్వరితగతిన జారీ చేయాలని పేర్కొన్నారు. మ్యుటేషన్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, మ్యుటేషన్లలో అక్రమాలకు పాల్పడితే ఉద్యోగాల నుండి తొలగిస్తామని హెచ్చరించారు. ఈ నెల 5 నుండి జనవరి 8వ తేదీ వరకు జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, సమస్యలను గుర్తించి త్వరితగతన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

విరామం

============================

ఇటీవల కాకినాడ పోర్టులో నౌకలో పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని పరిశీలించి, పూర్తి వివరాలను సేకరించేందుకు ఐదు ప్రభుత్వ శాఖల అధికారులతో కూడిన బహుళ క్రమశిక్షణా కమిటీనీ ఏర్పాటు చేశామని కలెక్టర్ ఎస్. షణ్మోహన్ తెలిపారు. ఈరోజు ఆయన పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు, రిసైక్లింగ్ నిరోధానికి చేపట్టిన కార్యక్రమాల వివరాలను పాత్రికేయులకు తెలిపారు. గత నెల 27వ తేదీన ఆర్డీఓతో కలిసి కాకినాడ యాంకరేజీ పోర్టులో "స్టెల్లా ఎల్" నౌకలో తనిఖీలు నిర్వహించి, పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామని చెప్పారు. పట్టుబడిన బియ్యం వివరాల కోసం ఏర్పాటు చేసిన కమిటీ నమూనాలు, డాక్యుమెంట్లను పరిశీలించి నివేదిక సమర్పిస్తుందని కలెక్టర్ వివరించారు. ఈ కమిటీలో రెవెన్యూ, పోలీస్, కస్టమ్స్, పౌరసరఫరాలు, పోర్టు అధికారులు ఉంటారని కలెక్టర్ వెల్లడించారు.

==============================

చిన్నారుల్లో వాతావరణ శాస్త్రంపై ఆసక్తిని పెంచి ఈ రంగం వైపు ఆకర్షితులయ్యేలా చేసేందుకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఒలింపియాడ్ ను జాతీయ స్థాయిలో నిర్వహించనుందని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్ర అధికారి జగన్నాధ్ కుమార్ తెలిపారు. వాతావరణ వ్యవస్థలు, వాతావరణంలో మార్పులు, రోజువారీ జీవితంలో వాతావరణ శాస్త్ర పాత్రను తెలుసుకునేందుకు ఇది మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ 150 సంవత్సరాల ఉత్సవాల్లో చిన్నారులకు అధిక ప్రాధాన్యతనిస్తూ.. రాష్ట్ర స్థాయిలో ఈ నెల 14, 15వ తేదీల్లో వర్చువల్ గా పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు ఢిల్లీలో జనవరి 15న జరిగే భారత వాతావరణ శాఖ వ్యవస్థాపక ఉత్సవాల్లో బహుమతులు అందజేస్తారని జగన్నాధ్ కుమార్ వివరిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

==============================

తిరుమలలో గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పాపవినాశం, ఆకాశగంగ, గోగర్భం, కుమారధార, పసుపుధార జలాశయాల్లో నీటిమట్టం పూర్తి స్థాయికి చేరుకున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుత నీటి నిల్వలు తిరుమలకు 270 రోజుల తాగునీటి అవసరాలకు సరిపోతాయని పేర్కొంది. పాపవినాశం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార డ్యామ్ లు నీటితో పూర్తిగా నిండాయని టిటిడి ప్రకటనలో వివరించింది.

==============================

నూతన వంగడాలను సృష్టించడం ద్వారా కుప్పంలోని హార్టికల్చర్ హబ్ కు దేశంలోనే గొప్ప గుర్తింపు లభించిందని శాసన మండలి సభ్యులు కంచెర్ల శ్రీకాంత్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం - హార్టికల్చర్ మిషన్ - ఇండో ఇజ్రాయిల్ ఎంబసీ న్యూఢిల్లీ సహకారంతో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విదేశీయుల బృందం కుప్పంలోని హార్టికల్చర్ హబ్ లో పరిశోధనలు చేసేందుకు రావడం గొప్ప విషయమన్నారు. విదేశీయులు మూడు రోజుల పాటు ఇక్కడ శిక్షణ పొందనున్నారని తెలిపారు. ఇక్కడి రైతులు ప్రస్తుతం విభిన్న వంగడాలతో పంటలు పండిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారని ఆయన వివరించారు.

==============================

అంగన్వాడీ కేంద్రాల్లో చేపడుతున్న పనులు వేగవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఐసీడీఎస్ పీడ, సీడీపీఓ, ఎంపీడీఓలను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల పనులు, పోషణ్ వాటిక నిర్వహణ ప్రగతిపై కలెక్టర్ శ్రవణమాధ్య సమావేశం ద్వారా ఈరోజు సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించి అందంగా తీర్చిదిద్దాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ వాటిక అమలు చేయాలని, ఇందుకు అవసరమైన పంటలు, మొక్కల విత్తనాలను ఉచితంగా అందిస్తామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు శాతం మెరుగుపడేలా కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు.

==============================

ఈ నెల 5వ తేదీన జరిగే ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలకు పశ్చిమ గోదావరి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 130 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. వీరిలో 26 మందిని పీఓలు గాను, 78 మందిని ఏపీవోలు గాను, 26 మందిని మైక్రో అబ్జర్వర్లు గాను నియమించారు. జిల్లాలో 3 వేల 729 మంది టీచర్లు ఓటు హక్కు కలిగి ఉన్నారు.

==============================

==============================